# రజని ఉత్తరం

బయటనుంచి "పోస్ట్" అన్న కేక వినిపించగానే చదువుతున్న పుస్తకం క్రింద పడేసి జయ గబగబా వెళ్ళింది. పోస్ట్‌మాన్ అందించిన కవరు తీసుకుని తిరిగి వచ్చి కుర్చీలో కూర్చుంది.

కవరుచింపి ఉత్తరం తీసింది. ఆ ఉత్తరం వ్రాసింది తన తండ్రి కాదు. బంధువులు కూడా కాదు. దస్తూరి చక్కగా వుంది. వాల్తేరు నుంచి వచ్చింది అది. జయ ఉత్తరం చదవడం మొదలు పెట్టింది.

డియర్ జగం!

నీ ఉత్తరం నాలుగు రోజుల క్రిందటే అందింది. అయితే నా ప్రయాణం గురించి ఎటూ నిర్ణయం కాకపోవడంవల్ల వెంటనే జవాబు వ్రాయడానికి వీలు పడలేదు. చివరకు నీతో నాలుగు రోజులు గడిపి తర్వాత మా వూరు వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను. నేను శనివారం రాత్రికి మీ బెజవాడ చేరుకుంటాను మెయిలులో. నువ్వు ఇప్పుడు ఆఫీసరువు గదా. అందువల్ల వీలుంటే స్టేషనుకు రా లేకపోతే నేనే మీ యింటికి రాగలను.

సంగతులు నే వచ్చాక చెప్పుకోవచ్చును. అందుకని ఏమీ వ్రాయలేదు.

నీ రజని

ఉత్తరం పూర్తి అయ్యేటప్పటికి జయ గుండె చెప్పరానంతగా బరువెక్కింది. ఉత్తరంలోని అక్షరాలు అలుక్కు పోయాయి. తల తిరిగిపోయింది.

ఒక్క నిమిషం అయోమయావస్థలో గడిపింది. తిరిగి ఉత్తరం చదివింది. క్రింద సంతకం చూసింది.

"రజని" అని వుంది. గుండ్రని అక్షరాలతో. వచ్చేది స్నేహితురాలే నని జయ దృఢ నమ్మకం. ఆ ఉత్తరం రాసింది స్త్రీ అనడానికి ఆ దస్తూరి క్రింద పేరు ఆధారాలయ్యాయి జయకు.

భర్త జగన్నాథంమీద జయకు తీవ్రంగా కోపం వచ్చింది. అందులో స్నేహితురాలొకతె రాబోతుందని మాట వరసకైనా తనతో భర్త చెప్పనందుకు జయ అనుమానం మరింత పెరిగింది.

ఆ రాత్రికే స్నేహితురాలు వచ్చేది. స్నేహితురాలితో తన భర్త అచ్చట్లు ముచ్చట్లు సాగిస్తుంటే తాను దిష్టి బొమ్మ మాదిరి చూడవలసి వస్తుందని జయ భావించింది. స్నేహితురాలు ఇక్కడ మకాం వేసినంతకాలం తాను పుట్టింటి దగ్గరే వుండటం అన్ని విధాల శ్రేయస్కరం అని జయ నిర్ణయించుకుంది. అందువల్ల రాత్రి మెయిలుకే తమ పుట్టిల్లు నెల్లూరు వెళ్ళడానికి నిశ్చయించుకుంది ఈ సంగతి భర్తతో చెప్పి వెళ్ళడం న్యాయమైనప్పటికి అనవసరంగా వాదోపవాదాలు పెరుగుతాయని జయ అనుకుంది. సూట్ కేస్‌లో బట్టలు కొన్ని సర్దుకుంది. భర్తకు ఉత్తరం వ్రాసింది.

పూజ్యులైన భర్తగారి పాదసన్నిధికి_

నన్ను క్షమించి నాయీ విన్నపం ఆలకించండి.

మీ ప్రియమైన స్నేహితురాలు ఈ రాత్రికి వస్తున్న రెండో ఉత్తరం వల్ల తెలుసుకొని ఆనందిస్తారని నమ్ముతున్నాను. మీయిద్దరకు మధ్యనే ఉండటం నాకు నచ్చలేదు. మీ ముచ్చట్లు వినేటంత సహనం

స్త్రీ అయిన నాకు లేనందుకు మన్నించండి. పోనీ, ఆమె సంగతి ఒక్క సారైనా నాతో అంటే పరిస్థితి వేరుగా ఉండేది. నాకు ఇంత బాధ ఉండేది కాదు మీ స్వాతంత్ర్యానికి నేను అడ్డురాను. ధర్మాధర్మాలు మీరే ఆలోచించుకో ప్రార్థన.

నేను ఒక వారం రోజులు పుట్టింట్లో పుండి వస్తాను. అది మన ఇరువురికి మంచిది. మీ అనుమతి లేకుండా బయలుదేరి వెళ్ళినందుకు నన్ను క్షమించ గోరుచున్నాను. టయిము లేకపోవడం ఒకటి, మీతో తర్కానికి దిగి మీ ఆదరాభిమానాలు తక్కువ చేసుకునే యిష్టం లేక పోవటం మరొకటి. వీటివల్లే మీరు ఆఫీసునుంచి రాకముందే స్టేషన్‌కు వెళ్ళిపోవలసి వచ్చింది. ఈరాత్రి మెయిలుకే వెళ్ళిపోతున్నాను. చేరగానే జావాబు వ్రాయగలను.

గత్యంతరం లేక మీకు ఇబ్బంది కలుగజేయ వలసి వచ్చింది.

చివరకు ఒక సంగతి స్నేహితురాలు వస్తున్నంత మాత్రాన వెళ్ళిపోవలసినంత అగత్యం ఏమని మీరనవచ్చు. అయితే లోగడ-అంటే అయిదు మాసాల క్రింద మనింటికి మీ స్నేహితురాలు కుసుమ అనే ఆవిడ వచ్చినప్పుడు మనిద్దరి మధ్య ఏర్పడ్డ అవాంచనీయ పరిస్థితి ఇప్పుడూ ఏర్పడకుండా వారించటానికి నే వెళ్తున్నాను. కుసుమ పున్నది ఒక పూటే ఆమెకు వూరుచూపే వంకతో ఆమె వూరూ వాడా గాలించినట్టు తిరగటం చూసినవాళ్ళు, ఇరుగుపొరుగులూ పరిపరి విధాలా అనటం యిప్పటికీ నా చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. మీ రజని నాలుగయిదు రోజులుండవచ్చునని తెలుస్తోంది.

మీ చరణదాసి

జయ

తిరిగి ఉత్తరం ఒక మాటు చదువుకుని తృప్తి పడింది. రెండు ఉత్తరాలు టేబులుమీద పెట్టి అన్ని తలుపులు వేసింది. వాకిట తలుపు కూడా వేసి తాళం చెవి పక్కింటి వారి కిచ్చింది. "మా చెల్లెలికి రేపు తాంబూలాలు పుచ్చుకుంటారని ఉత్తరం వచ్చింది నేను నెల్లూరు వెళ్తున్నాను. మా వారు రాగానే తాళం చెవి యివ్వండి. ఆయన వచ్చేటప్పటికి ఆలస్యం కావచ్చును" అని చెప్పింది వాళ్ళతో. రిక్షా కట్టించుకుని స్టేషన్‌కు వెళ్ళిపోయింది.

బాగా చీకటి పడిన తరువాత జగన్నాథం ఇంటికి వచ్చాడు. తలుపు తాళం వేసివుండటంచూసి గతుక్కు మన్నాడు. పక్కింటివాళ్ళ వాళ్ళ అబ్బాయి తాళం చెవి యిచ్చి జయ చెప్పిన కబురు చెప్పాడు.

జగన్నాథానికి ఏమీఅర్థం కాలేదు. తలుపు తీసి ఇంట్లోకి వెళ్ళాడు ఎదురుగుండా టేబుల్‌మీద ఉత్తరాలు చూశాడు. ఆత్రుతగా తీసి గబగబా రెంటీని చదివాడు. తక్షణ కర్తవ్యం ఏమిటా అని ఆలోచించాడు. నవ్వూ వచ్చింది. కంగారూ పుట్టింది.

కలకత్తా నుంచి మెయిలు రావటానికి యింకా నలభై నిమిషాలు టయిముంది.

ఇందులోనే రజని వచ్చేదీ, వెంటనే జయ వెళ్లేదీ. వెంటనే తలుపు తాళం వేసి స్టేషనకు బయలు దేరాడు.

ప్లాట్‌ఫారం టికెట్టు తీసుకొని లోపలికి వెళ్ళాడు. లేడీస్ వెయిటింగు రూం చేరుకున్నాడు. బయటనుంచి తొంగి చూచాడు జయకోసం. జయ లోపల వుంది. "బ్రతుకు జీవుడా" అనుకున్నాడు.

భర్తను చూచి జయకూడ బిత్తరపోయింది. బయటకు రమ్మనమని పిలిచాడు జయను. జయ ముఖంలో సిగ్గూ, కోపం రెండూ స్పష్టంగా గోచరిస్తున్నాయి ద్వారం దగ్గరకు వచ్చింది మాట్లాడకుండా.

"జయా! ఎందు కింత తొందరపడ్డావ్; ఒక్క నిమిషం ఆలో చించు కుంటే నువ్వయింత పని చేసే దానివి కావు. ఆ ఉత్తరం వ్రాసింది నా స్నేహితుడు రజనీకాంతరావు. స్నేహితురాలు కాదు. ఎందుకింత ఆపోహ పడ్డావ్! ఈ బండిలో దిగుతాడు. ఇంటికి టయిం అయింది. ఇప్పుడెలా? ఏం చేయాలి. మనిద్దరం వాణ్ణి రిసీవ్ చేసు కుందాం" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

జయ చాలా సిగ్గు పడింది.

"క్షమించండి. అ ఆవేదన అలా చేసింది. తొందరపడ్డాను. టికెట్టు ఇచ్చి రిడక్షను పోగా మిగిలిన సొమ్ము తీసుకురండి రేపు తీసుకోవచ్చు మీరొచ్చి" అని టిక్కెట్టు ఉత్తరకు ఇచ్చింది.

జగన్నాధం ఆ రెండు పనులు పది నిముషాల్లోపుగానే పూర్తి చేసుకుని వచ్చాడు.

జయ, జగన్నాధం మెయిలుకోసం ఎదురు చూస్తున్నారు "అదేమిటండీ! మీ స్నేహితుడి పేరు అలావుంది?" అంది జయ.

"పేరు తగ్గించుకున్నాడు. దస్తూరికూడా ఆడవాళ్ళ వ్రాతలాగే వుంటుంది. చాలా మంచివాడు" అన్నాడు జగన్నాధం నవ్వుతూ.

"బలే వాడే" అంది జయ సిగ్గుతో నవ్వుతూ, ఇంతలోకే మెయిలు వచ్చింది. జయ, జగన్నాధం వెతుక్కుంటూ వెళ్ళి రజనిని కలుసు కున్నారు. రజని మహా కలుపుగోలు మనిషి. పెట్లోంచి దిగుతూ "క్రొత్త అన్నగారిని వెతుక్కుంటూ వచ్చి ఇక్కడే స్వాగతం ఇచ్చిన మా చెల్లి నీ కన్నా చాలా ఉత్తమురాలురా" అన్నాడు జగన్నాధంతో.

మిత్రులిద్దరూ హాయిగా నవ్వుతున్నారు. జయ చిరు నవ్వునవ్వింది ఉత్తరవంక చూసి.